ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు

5

గురువారం 8 ఫిబ్రవరి 2024



ప్రొద్దుటూరులో డివైడర్లకు వైసీపీ రంగులు వేసిన దృశ్యం



డివైడర్లకు వైసీపీ రంగులు

● కోట్ల రూపాయల మున్సిపాలిటీ నిధులు ఖర్చు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి7: వైసీపీని రంగుల పిచ్చి వదలడం లేదు. ఇప్పటికే సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌సెంటర్లకు వైసీపీ రంగులు వేసి కోర్టుతో చీవాట్లు తింది. అయినా తీరు మారలేదు. తాజాగా ప్రొద్దుటూరు పట్టణం శివాలయం సర్కిల్ నుంచి మైదుకూరు మార్గంలోని ఆర్అండ్‌బీ రోడ్డు డివైడర్లకు వైసీపీ రంగులు వెలిశాయి. ఆర్అండ్‌బీకి చెందిన మైదుకూరు రోడ్డు విస్తరణ పనులను జగనన్న స్మార్ట్ సిటీ కింద మున్సిపాలిటీ వారు చేట్టారు. దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో దీనిని స్మార్ట్ స్ట్రీట్‌గా మార్చుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మైదుకూరు రోడ్డుకు కుడి ఎడమలవైపు విస్తరణ పనులు 60 శాతం చేపట్టి పాత్‌వే ఏర్పాటుచేశారు. ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నిధులను వినియోగిస్తున్నారు. ప్రజలు కట్టిన పన్నులతో విస్తరించిన ఆర్అండ్‌బీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ డివైడర్లకు వైసీపీ రంగులు వేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై టీడీపీ, బీజేపీ నేతలు ఈసీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం. కాగా.. డివైడర్లకు వైసీపీ రంగులు వేయడంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జుననను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కూడా చర్చించామన్నారు. వైసీపీ రంగులు వేయడంపై చర్యలు తీసుకుంటామన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి కడప పార్ల మెంట్ పరిధిలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగరపాలక కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటిదాకా తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి ఓటర్ల జాబితా రూపొందించామన్నారు. ఓటర్ల తుది జాబితా కట్ ఆఫ్ డేట్ జనవరి 12వ తేదీగా నిర్ణయించి ముసాయిదా జాబితాను విడుదల చేశామన్నారు. ఈ జాబితా వెలువడిన తరువాత ఫారమ్-6, 7, 8లపై అర్జీలు వచ్చాయన్నారు. ఇప్పటికే చాలా పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాపై ఏవైనా సందేహాలు ఉంటే ఆయా నియోజకవర్గాల ఈఆర్వోల దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కడపకు సున్నా

కడప, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి మూడేళ్లలో పూర్తి చేస్తానన్న ఉక్కు ఫ్యాక్టరీకి ఆయన పదవీ కాలంలో కనీసం ఓటాన్ బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించలేదు. జగన్ సంక్షేమం తప్ప ఎలాంటి అభివృద్ధి పట్టించుకోలేదు. నాలుగున్నరేళ్ల పాలనలో అటు నీటి పారుదల, ఇటు ఉపాధి ఇచ్చే పరిశ్ర మలపై జగన్ శిబిరం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 2024-25 రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి రూ. 2,84,389 కోట్లతో అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందులో సామాజిక పింఛన్లు, ఇతరత్రా వాటిని కేటాయింపుల్లో చూపించారు. అయితే సీఎం సొంత జిల్లా కడపలో ఉక్కు ఫ్యాక్టరీకి, పరిశ్రమలకు, నీటి పారుదలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. మరో మూడు నెలల్లో దిగిపోతున్న మనకెందుకులే అనుకున్నారేమో.. కడపకు ఎలాంటి నిధులు కేటాయించలేదనే విమర్శలు వచ్చాయి.

కడప నగర శివారులోని రిమ్స్ వద్ద నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ, మెంటల్ హెల్త్ కేర్, క్యాన్సర్ సెంటర్ ఆసుపత్రి భవనాలను సీఎం వైఎస్ జగన్ గత ఏడాది డిసెంబరులో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేసుకున్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభం అయింది కదా.. ఇక తమకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషించారు. ఇప్పటికి దాదాపు రెండు నెలలు అవుతోంది. సీఎం జగన్ ప్రచారానికి తప్ప.. పేదల వైద్యానికి ఈ ఆసుపత్రులు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో కూడా తెలీని పరిస్థితి. క్యాన్సర్ అసుపత్రి ఇంకా ప్రారంభమే కాలేదు. మిగిలిన వాటిల్లో వైద్య పరికాలే లేవు. ఇదీ ఇక్కడ అందుతున్న సూపర్ వైద్యం తీరు.

ఇంకా వైద్యసేవలు అందుబాటులోకి రాని క్యాన్సర్ కేర్ ఆసుపత్రి



ఏదీ మెడికల్ హబ్..?

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: కడప నగర శివారులోని రిమ్స్ అమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో గత డిసెంబరు నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడు ప్రధాన ఆసుపత్రులను స్వయంగా వచ్చి ప్రారంభించారు. రూ.107 కోట్లతో క్యాన్సర్ కేర్ 100 పడకల ఆసుపత్రి, రూ.48.82 కోట్లతో మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రి 100 పడకల సామర్థ్యంతో, రూ.125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 452 పడకల సామర్థ్యం ఉన్నట్టు ఈ సందర్భంగా అట్టహాసంగా ప్రకటించారు. ఇందులో సూపర్ స్పెషాలిటీ వైద్య పరికరాల కోసం రూ.50 కోట్లు, మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రి వైద్య పరికరాలకు రూ.2.5 కోట్లు, క్యాన్సర్ కేర్ వైద్య పరికరాల కోసం రూ.58 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రే స్వయంగా వచ్చి తన చేతుల మీద ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి, కడపను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దామని గొప్పలు చెప్పి వెళ్లారు. ఇవి కేవలం మాటలే కానీ చేతల్లో ఇంకా కార్యరూపం దాల్చలేదు.

క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభం అయ్యేనా

క్యాన్సర్ కేర్ ఆసుపత్రిలో ఇప్పటివరకు వైద్య సేవలను ప్రారంభించలేదు. ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తి కానేలేదు. వైద్య సిబ్బంది నియామకాలు జరగనే లేదు. పరికరాలు అందుబాటులో లేనే లేవు. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే ముఖ్యమంత్రి మాత్రం ఆసుపత్రిని ప్రారంభించి, సెల్ఫీలు తీసుకుని వెళ్లారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన వెంటనే క్యాన్సర్ కేర్ ఆసుపత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఎప్పుడు ప్రారంభిస్తారని సంబంధిత అధికారులను అడిగితే, సరైన సమాధానం లభించడంలేదు. భవనాలు పూర్తి కాలేదని, ఇంకా పర్మిషన్ ఇవ్వలేదని, పరికరాలు ఆసుపత్రికి చేరలేదని ఇలా ఏవేవో సాకులు చెప్తున్నారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి..

మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రిలో చాలా వరకూ వైద్య సేవలు అందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీలో ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. క్యాన్సర్ కేర్ మాత్రం ఇంకా ప్రారంభించలేదు. బిల్డింగ్ మరియు వైద్య పరికరాలు, సిబ్బంది కొరత ఉంది. త్వరలోనే రోగులకు అందుబాటులోకి తెస్తాం.



- డాక్టర్ రమాదేవి,
సూపరింటెండెంట్, సర్వజన
ఆసుపత్రి, కడప

'మెంటల్'లో మౌలిక వసతుల్లేవ్

మెంటల్ హెల్త్‌కేర్ ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు ఇంకా కల్పించలేదు. రోగులకు తాగడానికి, అవసరానికి నీళ్లు లేవు. ఇక రోగుల వివరాలను పొందుపరచడానికి ఇంటర్‌నెట్ సౌకర్యం లేక, డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేక, ఎఫ్ఆర్ఎస్ వేయలేక సతమతమవుతున్నారు. వసతులను కల్పించడంలో అధికారులు చొరవ చూపడంలేదనే విమర్శ వినిపిస్తోంది. రోగులకు ఏదైనా వైద్య పరీక్షలు చేయాలంటే సిబ్బంది లేక సర్వజన ఆసుపత్రికి పంపిస్తున్నారు. దూరం నుంచివచ్చే రోగులు ఓపీకి ఒక చోట, పరీక్షలు ఇంకో చోటకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్య పరీక్షలు నిర్వహించే సిబ్బంది (టెక్నీషియన్లు) లేక రోగుల బాధ వర్ణనాతీతం. అన్ని వసతులను కల్పించకుండానే ఆర్భాటంగా ప్రారంభించి అభాసుపాలైనట్లు ఉందని రోగులు అంటున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఓపీకే పరిమితం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కేవలం ఓపీకే పరిమితమైంది. ఐపీ ఇంకా ప్రారంభించలేదు. వైద్య పరికరాలు వినియోగంలోకి తీసుకురాలేదు. చివరికి మందులు సైతం సర్వజన ఆసుపత్రి నుంచే పొందుతున్నారు. సూపర్ స్పెషాలిటీకి వచ్చే రోగులు సైతం వైద్య పరీక్షల కోసం సర్వజన ఆసుపత్రినే ఆశ్రయించాల్సి వస్తోంది. అటూ ఇటూ తిరగలేక వైద్యం కోసం వచ్చే రోగులు ఎందుకొచ్చాంరా దేవుడా.. అని తల బాదుకునే పరిస్థితి తయారైంది.

ఏది ఏమైనా సీఎం సొంత జిల్లాలో వైద్య సేవలు పొందాలంటే రోగులు చాలా వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఆసుపత్రుల్లో వైద్య సేవలు, వసతులను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే భావన, వాదన ప్రజల్లో, రోగుల్లో బలంగా వినిపిస్తోంది. పబ్లిసిటీకోసం చూపిన శ్రద్ధ సౌకర్యాల కల్పనలో చూపించి ఉంటే బాగుండేదని రోగులు అంటున్నారు.

బిల్లులు రావని వైద్యపరికరాలకు బ్రేక్ ?

క్యాన్సర్ కేర్, హెల్త్‌కేర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించి రెండు నెలలు అవుతున్నా ఇంకా వైద్య పరికరాలు రాలేదు. దీనికి కారణం బిల్లులు రావనే భయంతో సంబంధిత కాంట్రాక్టర్ వైద్య పరికరాలను ఆసుపత్రులకు అందజేయలేదని తెలిసింది. త్వరలోనే ఎన్నికలు ఉండడం, ప్రభుత్వం మారితే బిల్లులు ఆగిపోతాయేమోనని వైద్యపరికరాలను సరఫరా చేయడంలేదని ఆసుపత్రి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

● అట్టహాసంగా డిసెంబరులో సీఎంచే ప్రారంభం..
● ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని వైద్యసేవలు
● ఆసుపత్రికి చేరని వైద్య పరికరాలు
● వసతుల కల్పనలో ప్రభుత్వం అలసత్వం
● ఇదీ సీఎం సొంత జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పరిస్థితి



క్యాన్సర్ కేర్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంతో లోపల ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం



రోగులు కూర్చునే కుర్చీలూ మూలకే

ప్రత్యేక హోదాపై సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి7: రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనేది ఎండమావిగా కనిపిస్తోందని, ప్రత్యేక హోదాను చట్టంలో పొందుపరచలేదని, పొందుపరిచి ఉంటే కనీసం కోర్టుకు వెళ్లైనా సాధించుకునే వాళ్లమని, తమపై ఆధారపడే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే తప్ప హోదా సాధ్యంకాదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బేలగా అసెంబ్లీలో మాట్లాడడం హాస్యాస్పదమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదాకు చట్టం అవసరం లేదని, ఎగ్జిక్యూటివ్ ఆర్డరు ద్వారా దేశంలోని పది రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉందన్నారు. 2014 మార్చి 1న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు సంవత్సరాలు హోదా ఇస్తూ మంత్రివర్గ తీర్మానం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదన్నారు. రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందాలంటే వైసీపీ ఎంపీల మద్దతు అవసరమన్నారు. కానీ హోదా షరతు విధించకుండా అన్ని బిల్లులకు వైసీపీ మద్దతు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలిరోజు నుంచి ప్రత్యేక హోదా అమలు చేస్తామని తులసిరెడ్డి అన్నారు.

రోడ్డు గుంతలు పూడ్చలేరు కానీ..

ఓట్ల కోసం డబ్బు సంచులతో వస్తున్నారు

● వైసీపీ నేతలపై మాజీ ఎమ్మెల్సీ దేవగుడి ధ్వజం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7: ప్రధాన రోడ్లు దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా గుంతలు పూడ్చలేని కొందరు వైసీపీ నాయకులు గ్రామాల్లోకి ఓట్లకోసం డబ్బు సంచులతో వస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు.. బుధవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరం రోజులుగా పులివెందులలో ప్రారంభమైన డబ్బుల పంపకం మూడు రోజులుగా జమ్మలమడుగుకు పాకిందన్నారు. వారం రోజుల్లోనే దాదాపు రెండున్నర కోట్ల రూపాయలు పంపిణీ చేశారని అన్నారు. గ్రామ నాయకులను తృప్తి పరచడానికి వైసీపీ నాయకులు డబ్బు సంచులతో రాత్రిపూట గ్రామాల్లో తిరిగి పంచుతున్నారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ప్రజల్లో తిరుగుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి వస్తున్న ఆదరణ వైసీపీ నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రెండుసార్లు స్టీల్‌ప్లాంట్ కోసం శంకుస్థాపన చేసినా ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదన్నారు. గండికోట ముంపు బాధితులు, రాజోలి బాధితులు, స్టీల్ ప్లాంట్ బాధితులు భూములు కోల్పోయి కార్యాలయాల చుట్టూ, నాయకుల చుట్టూ తిరుగుతున్నా వారిని పట్టించుకోవడం లేదన్నారు. కొందరు నాయకులు వైసీపీలో ఇబ్బందులు పడలేక తెలుగుదేశం వైపు చూస్తుంటే జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన నాయకుడు దోచుకున్న డబ్బులు బయటకు తీస్తున్నారన్నారు. ఇప్పటికే జమ్మలమడుగు, పెద్దముడియం ప్రాంతాల్లో రూ.5లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇచ్చారని అన్నారు. నియోజకవర్గంలో తమ టిప్పర్లకు శిఖా పేరు పెట్టుకుని ఇసుక, బూడిద అక్రమంగా తోలుకుంటూ కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. సిమెంటు ఫ్యాక్టరీల వద్ద, సోలార్ ఫ్యాక్టరీ, ముద్దనూరు సిలికాన్ వారి నుంచి బెదిరించి సొమ్ములు తీసుకున్న నియోజకవర్గ నాయకుడు చివరకు చిన్నపాటి ఉద్యోగాలను కూడా అమ్ముకున్నాడన్నారు. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసి గెలుస్తామని విర్రవీగుతున్న వీరికి ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాజా, కుదుముల పుల్లారెడ్డి, చౌడం జొల్లు పాండు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

గోవా మద్యం సీసాలను పట్టుకున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ (ఫైల్)



పుట్టగొడుగుల్లా

బెల్టుషాపులు

● నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
● పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్న బెల్టుషాపు నిర్వాహకులు

కడప (క్రైం), ఫిబ్రవరి 7: జిల్లాలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. నగరాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల పోలీసుల తనిఖీల్లో ఎక్కువగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారే పట్టుబడుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలు దూరంగా ఉండడం, కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు లేకపోవడంతో బెల్టుషాపులు మూడు పుల్లులు ఆరు బీర్లు అన్నట్టుగా సాగుతున్నాయని అంటున్నారు. చాలా చోట్ల కిరాణా షాపుల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. జిల్లలో దొరికే మద్యమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా మద్యాన్ని తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. దొరికినోళ్లు కొంతమందైతే దొరకని వారు మరెందరో ఉన్నారు. షాపుల్లోని ధరల కన్నా బాటిల్‌పై రూ.20-30 అదనంగా అమ్ముతున్నారు. రాత్రివేళ, ఉదయం సమయాల్లో అయితే ఈ ధర మరింత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఇటీవల గోవా నుంచి కూరగాయల మాటున భారీ ఎత్తున మద్యాన్ని తరలిస్తుండగా ప్రొద్దుటూరు పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఇలా ఇతర రాష్ట్రాల నుంచి కూడా జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు దాటి మరీ రావడం చూస్తే పోలీసుల నిఘా వైఫల్యం స్పష్టంగా తె లుస్తుంది. చట్టవిరుద్ధంగా ఈ బెల్టుషాపులు యథేచ్ఛగా నిర్వహిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టడంతో ఈ బెల్టుషాపుల నిర్వహణ బయటపడుతోంది. లేకపోతే ఈ వ్యవహారం మరింత జోరుగా సాగేది.

పేరుకే కిరాణా షాపులు.. అమ్మేది మద్యమే?

కొంత మంది కిరణా షాపులు నిర్వహిస్తూ లోపల మద్యం వ్యాపారం చేస్తున్నారు. నగర శివార్లలో కిరాణా షాపులు నిర్వహిస్తూ ఆ మాటున మద్యం బాటళ్లు, బీర్లు అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక కొంతమంది తమ ఇళ్లనే బెల్టు షాపులుగా మార్చేస్తూ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలో మద్యం వ్యాపారం బెల్టుషాపుల ద్వారా ఇష్టారాజ్యంగా సాగుతోంది. గతంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించంతో ఈ దందా కొనసాగుతూ వస్తోంది. పోలీసుల తనిఖీల్లో బెల్టుషాపుల నిర్వాహకులు పట్టుబడుతుండటంతో ఇప్పుడు ఒక్కోటీ వెలుగులోకి వస్తున్నాయి.

ఇటీవల పట్టుబడ్డ మద్యం కేసుల వివరాలు

● ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పోలీసులకు గత నెల 31న పట్టుబడ్డారు. వీరిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12.52 లక్షల విలువ చేసే ఐచర్ వాహనంతో పాటు ఎండీపీఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 2వ తేదీ ఇద్దరు బెల్టుషాపుల నిర్వాహకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

● కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 1వ తేదీన ఒకరిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తాలూకా పరిధిలో, రిమ్స్, టూటౌన్ పరిధితో పాటు జిల్లా అంతటా అక్కడక్కడా మద్యం అమ్ముతూ పోలీసులకు బెల్టుషాపు నిర్వాహకులు పట్టుబడడంతో వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.



చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుబడ్డ అక్రమ మద్యం వ్యాపారులు (ఫైల్)

ఎస్సీ, ఎస్టీలకు పంగనామాలు

● పారిశ్రామిక వేత్తలకు ఇవ్వని ప్రోత్సాహక నిధులు
● జిల్లాలో రూ.118 కోట్ల బకాయిలు
● బ్యాంకుల ఈఎంఐలు చెల్లించలేక అవస్థలు
● నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూపులు

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం వైఎస్ జగన్ బహిరంగసభల్లో నా ఎస్సీలు నా ఎస్టీలు నా బీసీలు అంటూ ఎనలేని ప్రేమ ఒలకబోస్తారు. ఆ వర్గాలకు తానే పెన్నిధిగా చెప్పుకొస్తారు. వారి అభ్యున్నతికి మాత్రం పాటుపడకుండా చేతులెత్తేశారంటారు. సబ్ ప్లాన్ నిధులు, ఇతర ఎస్సీ ఎస్టీ పథకాలన్నీ సీఎం జగన్ అటకెక్కించారు. ఇప్పుడు పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులకు ఎగనామం పెట్టారు. వైజాగ్‌లో పారిశ్రామిక సదస్సు నాటికి ఇస్తామని చెప్పి మాట మార్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో వాయిదా వేశారు. ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశాల్లో కూడా ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహక నిధుల చెల్లింపులకు నిధులు కేటాయించలేదు. పరిశ్రమల నిర్వహణ వ్యయం పెరగడం, ప్రోత్సాహక నిధులు రాక బ్యాంకులకు సక్రమంగా ఈఎంఐలు కట్టలేక వీరు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రూ.118 కోట్ల ప్రోత్సాహక నిధులు రావాల్సి ఉంది. ఏడాదిగా ఎదురుచూపులు చూస్తున్నారు.

వైఎస్సార్ బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహక నిధులు ఇస్తున్నారు. ఈ మేరకు ఈ స్కీం ప్రారంభం రోజున సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ " షెడ్యూలు కులాలు తెగలు శ్రామికులుగా ఉండకూడదు. శ్రామికులుగా ఉండే రోజులు పోవాలి, వారు కూడా గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎవరికీ తీసిపోని విధంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. ఇంతవరకు రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టరుకు కోటి రూపాయల వరకు ప్రోత్సాహక మొత్తం ఇవ్వనున్నాం" అని చెప్పుకొచ్చారు. యూనిట్ సబ్సిడీని 45 శాతంగా నిర్ధారించారు. జిల్లాలో ఎస్సీలు 1,635, ఎస్టీలు 149 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో యూనిట్ రూ.10లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ఉంది. యూనిట్ కాస్ట్‌లో 25 శతం లబ్ధిదారుని వాటా కాగా 75 శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. అయితే ప్రభుత్వం తను ఇచ్చే 45 శాతం సబ్సిడీ నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమ చేయాల్సి ఉంది. జిల్లాలో ఎస్సీఎస్టీలు బస్సులు, లారీలు, ఎక్సకవేటర్లు, పెట్రోట్యాంకర్లు, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఫ్లెక్సీ ప్రింటింగ్‌లు, హోటల్స్, బ్యూటీపార్లర్, గిడ్డంగులు... ఇలా తమకు నచ్చిన యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 2 వేల నుంచి 4వేల మందికి వీటి ద్వారా ఉపాధి కల్పిస్తున్నారను. ఇక పన్నుల ద్వారా ఏడాదికి రూ.కోట్లు చెల్లిస్తున్నారు.

ప్రోత్సాహక నిధుల విడుదలలో జాప్యం

ఉన్నత చదువులు, నైపుణ్యం ఉన్న ఎస్సీఎస్టీలు వైఎస్సార్ బడుగు వికాసం పథకంలో భాగంగా పరిశ్రమల శాఖ ద్వారా యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. తమ వద్ద 25 శాతం డబ్బు లేకున్నా అప్పులు తెచ్చి మరీ యూనిట్లు పెట్టారు. బ్యాంకు ద్వారా తీసుకున్న 75 శాతం రుణాన్ని నెలవారీ కంతుల్లో చెల్లించాల్సి ఉంది. యూనిట్లు రన్ అయినా లేకపోయినా ఆదాయం వచ్చినా రాకున్నా సరే బ్యాంకులకు మాత్రం నెలనెలా కంతులు కట్టాల్సి ఉంది. లేదంటే సిబిల్ స్కోరుపై ప్రభావం పడుతుంది. ప్రభుత్వం తన వాటాగా 45 శాతం సబ్సిడీ అందించాల్సి ఉంది. గత ఏడాది వైజాగ్‌లో జరిగిన పారిశ్రామిక సమ్మిట్‌లో 45 శాతం సబ్సిడీ నిధులు విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అంటూ వాయిదా వేశారు. మళ్లీ ఫిబ్రవరిలో విడుదల చేస్తామంటూ సీఎం జగన్ చెప్పుకొచ్చారు. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో కూడా దీనిని ప్రస్తావించలేదు. ఇది ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలను తీవ్ర మనోవేదనకు గురిచేసింది. జిల్లాలో ఎస్సీలకు సంబంధించి రూ.106 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.12 కోట్ల మేర సబ్సిడీ ప్రోత్సాహక నిధులు అందాల్సి ఉంది. దాదాపు ఏడాదిగా ప్రోత్సాహక నిధులు రాకపోవడంతో బ్యాంకులకు కంతులు కట్టలేక అవస్థలు పడుతున్నామని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలలో జాప్యంతో ఎస్సీఎస్టీ పారిశ్రామికవేత్తలు సోమవారం కడప నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవత్తలకు ప్రోత్సాహం విడుదల చేయాలంటూ ఫ్లెక్సీలు పెట్టుకుని నిరసన తెలిపారు.




ప్రోత్సాహక నిధుల కోసం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీఎస్టీ పారిశ్రామికవేత్తలు (ఫైల్)

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య


ధనుంజయ మృతదేహం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: రాయచోటి పట్టణంలోని రవి థియేటర్ సమీపంలో గల రామాలయం సమీపంలో నివాసం ఉంటున్న ధనుంజయ (36) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి వివరాల మేరకు.. ఆర్థిక ఇబ్బందులు, వివాహం కాలేదనే మనస్థాపానికి గురై ఇంట్లోని మోల్డింగ్ కడ్డీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న ఆ యువకుడిని అతని తల్లి చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


పెంచలయ్య మృతదేహం

పుల్లంపేట, ఫిబ్రవరి 7: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డిపల్లె అరుంధతివాడకు చెందిన గనేరు పెంచలయ్య (40) ఏ పనిలేకుండా మద్యానికి అలవాటుపడి తిరుగుతుండేవాడు. భార్య, పిల్లలను ఇబ్బంది పెడుతూ డబ్బుల కోసం వేధించేవాడు. చివరకు ఇంట్లో ఉన్న మేకలను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా భార్య పద్మశాలి అడ్డుకుంది. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు దొరకక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గడ్డి వామి దగ్ధం


మంటల్లో కాలిపోతున్న గడ్డి వామి

కాశినాయన ఫిబ్రవరి7: మండలంలోని కొండ్రాజుపల్లెలో బుధవారం సుబ్బయ్య అనే రైతుకు చెందిన వరి గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయిందని గ్రామస్థులు తెలిపారు. వామినుంచి మంటలు రావడం గుర్తించిన స్థానికులు వెంటనే పోరుమామిళ్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చే సమయానికే వరిగడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో రైతుకు దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గోపవరం, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని ప్రాజెక్టు కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమిట్టకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంలో వీపీ కుంట నుంచి ఒంటిమిట్టకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ ప్రసాద్‌ను బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

102 బియ్యం బస్తాలు పట్టివేత


బియ్యం బస్తాలు పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

చెన్నూరు, ఫిబ్రవరి 7: చెన్నూరు అరుంధతీవాడలో కొండూరు హరిక్రిష్ణకు చెందిన షెడ్డులో నిల్వ ఉంచిన 102 బియ్యం బస్తాలను కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవా రం పట్టుకున్నారు. 102 బస్తా లు పట్టుబడగా, వాటి విలువ రూ.1,94,481 ఉంటుందన్నారు. జిల్లా విజిలెన్స్‌అధికారి షేక్ మసుంబాషా ఆదేశాల మేరకు ఈ దాడులు చేసి.. చెన్నూరుకు చెందిన వీరబ్రహ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఈదురుబాషా, బాలగంగాధర్‌రెడ్డి, మనోజ్, సాయి ప్రసాద్, సుదర్శన్, జనార్ధన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అగ్నిప్రమాదం


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన కంప్యూటర్ గది

చిట్వేలి, ఫిబ్రవరి 7: చిట్వేలి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సబ్ రిజిస్ట్రారు ఎం.శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కంప్యూటర్ గదిలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని, ఈ ఘటనలో కంప్యూటర్ సామగ్రి, బ్యాటరీలు, తదితర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. దీంతో కార్యాలయంలో మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. కాగా డాక్యుమెంట్స్ పక్కనే ఉన్న గదిలో భద్రపరచడంతో వాటికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సుమని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్ఐ శేషంరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్నానది శివార్లలో మట్టి అక్రమ రవాణా

రెండు ఎక్స్‌కవేటర్ల పట్టివేత


పోలీసు స్టేషన్ ఆవరణంలో ఉన్న ఎక్స్‌కవేటర్లు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7 : జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ పోలీసు సిబ్బంది బుధవారం పెన్నానదిలో రెండు ఎక్స్‌కవేటర్‌లను పట్టుకున్నారు. పెన్నానది శివార్లలో ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్లకు నింపుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఎక్స్‌కవేటర్లను జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలో పెట్టారు. వీటికి సంబంధించి జమ్మలమడుగు అర్బన్ ఎస్ఐ సుబ్బారావును 'ఆంధ్రజ్యోతి' అడుగగా పెన్నానదిలో ట్రాక్టర్లకు మట్టి నింపుతుండగా తమ సిబ్బంది పట్టుకుని తెచ్చినట్లుగా ఆయన తెలిపారు.

నగదు బ్యాగు పోగొట్టుకున్న మహిళ

దొరికిన బ్యాగును తిరిగి అప్పగించిన ఏఆర్ కానిస్టేబుల్ శంకరయ్య

కడప (క్రైం), ఫిబ్రవరి 7: రోడ్డుపై వంద రూపాయలు నోటు చిక్కితే అటూ ఇటూ చూసి ఆ నోటును చటుక్కున జేబులో వేసుకుని వెంటనే అక్కడ నుంచి జారుకునే ఈ రోజుల్లో ఓ ఏఆర్ కానిస్టేబుల్ తనకు దొరికిన నగదుతో కూడిన బ్యాగును బాధితురాలికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్న సంఘటన కడప నగరంలో చోటు చేసుకుంది. చెన్నూరు నుంచి షాపింగ్ నిమిత్తం లక్ష్మీదేవి అనే మహిళ కడప నగరానికి బుధవారం సాయంత్రం నగదుతో కూడిన తన బ్యాగు పోగొట్టుకుంది. అందులో 125 కువైట్ దినార్లతో పాటు రూ.20 వేలు నగదు ఉంది.

స్థానిక పాతబస్టాండులో పూలంగళ్ల వద్ద దారిలో వెళుతూ బ్యాగు పోగొట్టుకుంది. అక్కడే పూలను కొనడానికి వెళ్లి ఏఆర్ కానిస్టేబుల్ శంకరయ్య (పీసీ 3124)కు ఆ బ్యాగు కంటపడింది. అది ఎవరిదని ఆరా తీయగా తమది కాదని అక్కడ వారు తెలిపారు. బాధితులు వస్తే తనకు ఫోను చేయాలని కానిస్టేబుల్ అక్కడ వారికి తన ఫోను నెంబరు ఇచ్చాడు. అయితే అదే మార్గంలో బ్యాగును పోగొట్టుకున్న ఆ మహిళ వెదుకుతూ అక్కడి వారి సమాచారంతో శంకరయ్యకు ఫోను చేసింది. వెంటనే ఆ ఏఆర్ కానిస్టేబుల్ వచ్చి బాధితురాలికి ఆ బ్యాగును అందించారు. దీంతో బాధితురాలు లక్ష్మీదేవి ఆ కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. విషయం తెలుసుకున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్ శంకరయ్యను అభినందించారు.

జగన్‌రెడ్డి పాలనలో దళితులపై దమణకాండ

- యథేచ్ఛగా దాడులు, హత్యలు.. మానభంగాలు
- ప్రేక్షకపాత్రలో పోలీసులు, అధికారులు
- వైసీపీ మరోసారి గెలిస్తే రాష్ట్రం రావణకాష్టం
- 11న రాజమండ్రిలో దళిత సింహగర్జన
- పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒకప్రాంతంలో దళితులపై వైసీపీ పెత్తందారుల దమనకాండ కొనసాగుతోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. బుధవారం కడప ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన దళిత సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో దళితులన్నా.. దళిత వైద్యులన్నా.. దళిత మహిళలన్నా.. దళిత ఉద్యోగులన్నా.. దళిత యువత అన్నా లెక్కలేని తనంతో నీచంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ఆసుపత్రిలో మాస్కులు లేవన్న దళిత వైద్యుడైన సుధాకర్, కడపలో పశువైద్యుడు డాక్టర్ అచ్చన్నల పట్ల వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. వీరిద్దరి చావుకు వైసీపీ పెత్తందారీ పోకడే కారణమన్నారు. వైసీపీ దుర్మార్గాలను ప్రశ్నించిన పాపానికి వెంకాయమ్మను పొట్టన పెట్టుకున్న తీరు దారుణమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వంత జిల్లా పులివెందులలో దళితమహిళ అయిన నాగమ్మను కిడ్నాప్ చేసి మరీ మానభంగంతో హత్యచేసినా ఇంతవరకూ అతీగతీలేదన్నారు. వైసీపీ పెత్తందారుల, నాయకుల కనుసన్నల్లో కొంతమంది గూండాలు, రౌడీలు గ్రామ, మండలాలు, నియోజకవర్గాలు జిల్లా కేంద్రాలలో పనిగట్టుకుని దళితుల భూములు, స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా అడ్డుచెప్పేనాధుడే లేరన్నారు. ఏమిటీ అన్యాయమని ప్రశ్నించిన దళితులను బెదిరించడం, దాడులకు బరితెగించడం, లేదంటే ఏకంగా హత్యచేయడం, మహిళలపై మానభంగాలకు బరితెగించడం పరిపాటిగా మారిందన్నారు. న్యాయంకోసం పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. పైపెచ్చు పోలీసుల అండతోనే దళితులపై దమనకాండ సాగుతోందన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు దళితులు సిద్ధం కావాలన్నారు. గతంలో దళితులకు అందే 27 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి పాలనలో అటకెక్కించి దళితుల నోట్లో మట్టికొట్టారన్నారు. దళితుల అభివృద్ధికోసం ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. విద్యను కూడా సక్రమంగా దళితులకు అందకుండా చేయాలనే కుట్రతో పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ లేకుండా చేశారన్నారు. నిరుద్యోగుల ఆశలపై గత 5 సంవత్సరాలుగా జగన్‌రెడ్డి నీళ్లు చల్లడంతో ఆయనపై గల విశ్వాసం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిందన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటుగా జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పలికేందుకై రాజమండ్రి వేమగిరిలో ఈనెల 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు తలపెట్టిన దళిత సింహగర్జన సభను దిగ్విజయం చేసేందుకు జిల్లాలోని దళితులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత సింహగర్జన కడప ఇన్‌చార్జ్ ఎం.విజయ్‌కుమార్, దళిత నాయకులు కె.మత్తయ్య, ఆర్ఎన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వరాయసాగర్ చేపల వేలం

కడప(రూరల్) ఫిబ్రవరి7: వీరపునాయునిపల్లె మండలం కొమ్మద్ది గ్రామ పరిధిలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొని అమ్ముకోవడానికి గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మద్ది గ్రామ సచివాలయంలో ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-00 వరకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డుతో పాటు రూ.10,000లు పైకం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. రిజర్వాయర్ గుత్త రూ.2,66,466 నుంచి మొదలవుతుందన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుపు షర్టు, లుంగీ కట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా మిస్సింగ్ అయినట్లు తెలిస్తే 91331009537 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 7: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బురకాయలకోట హైవే రోడ్డు వద్ద మద్యం అమ్ముతున్న బావాజి(40)ని అరెస్టు చేసి అతని నుంచి ఎనిమిది మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ నజీర్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా అంకన్న


నాగుల అంకన్న

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 7: కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రారుగా డాక్టర్ నాగుల అంకన్న నియమితులయ్యారు. వైవీయూ ఆంగ్ల శాఖలో అసోసియేట్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న నాగుల అంకన్నను నియమిస్తూ ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మైలవరం మండలం బోగాల కట్ట గ్రామానికి చెందిన డాక్టర్ అంకన్న పాఠశాల విద్య జమ్మలమడుగులో పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేసి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పూర్తి చేశారు. 2009లో వైవీయూ ఆంగ్ల శాఖ అసిస్టెంటు ప్రొఫెసరుగా ఎంపికైన అంకన్న 2021లో అసోసియేట్ ప్రొఫెసరుగా పదోన్నతి అందుకున్నారు. యూనివర్సిటీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించా రు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ తాను పనిచేస్తున్న సంస్థల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అలాగే రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడతామని స్పష్టం చేశారు.

పరిశోధనల్లో ఆధునిక విధానాలు అనుసరిద్దాం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: సాంప్రదాయ విధానాలను విడనాడి ఆధునిక పద్ధతులను పరిశోధనల్లో వినియోగించి జంతు జీవకోటిని కాపాడకుందామని వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం వైవీయులో జరిగిన నైతికవిలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రయోగశాలల్లో జంతువుల స్థానంలో ప్రత్యామ్నాయ విధానాలను అవలం భించడం పట్ల అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయో గశాలల్లో వినియోగించే దిశగా మనం వెళ్లాలని తెలిపారు. సెమినార్ కన్వీనరు జువాలజీ అసోసియేట్ ప్రొఫెసరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పరిశోధకులకు విలువైన సమాచారాన్ని ఈ సెమినార్ ఇచ్చిందన్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసరు బీహెచ్‌రావు మాట్లాడుతూ జంతువులను బాధల నుంచి తప్పించే కొత్త మార్గాలను అన్వేషించే బాధ్యత పరిశోధకులపై ఉందన్నారు. శాంతిపట్నాగర్ అవార్డుగ్రహీత హైదరాబాదు టీడీఎఫ్‌టీ గ్రూపు లీడరు డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రిమినల్ ఇన్విస్టిగేషన్‌లో ఫ్రింగర్‌ప్రింట్స్ ఎలా వినియోగిస్తారన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈసదస్సులో డాక్టర్ వెంకటరమయణ, అనుప్రసన్న, వెంకటరమణారెడ్డి, మరియదాస్, మనస్వరి, స్కాలర్లు పాల్గొన్నారు

ఓపెన్ స్కూల్స్ కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాసరాజు



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్‌గా రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండూరు శ్రీనివాసరాజును నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన డీఈఓ కార్యాలయంలో డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలను గుర్తించి ఓపెన్ స్కూల్స్ ద్వారా వారి నమోదు సంఖ్యను పెంచడమే కాకుండా ఉత్తీర్ణత శాతాన్ని పెంచి నిరక్షరాస్యత లేకుండా చూడాలని, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని ఆయన సూచించారు. అనంతర ం శ్రీనివాసరాజు మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఈ బాధ్యతను ఎటువంటి విమర్శలకు తావు లేకుండా అంకిత భావంతో నిర్వర్తిస్తానన్నారు. అందరి సహకారంతో జిల్లాలో డ్రాపౌట్స్ లేకుండా చూస్తామన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించండి


వసతులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ పీడీ శశికళ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7: ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ పీడీ శశికళ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలసదనాన్ని ఆమె పరిశీలించారు. బాలసదనంలో అతి తక్కువ మంది పిల్లలున్నారని అంగన్వాడీ వర్కర్లు పిల్లలను బాలసదనంలో చేర్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ అరుణమ్మపై నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లోని 52 అంగన్వాడీ కేంద్రాలు నాడు-నేడు కింద ఎంపికయ్యాయని, ఆయా పాఠశాలలకు సంబంధించిన వారు బ్యాంక్‌ల్లో అకౌంట్స్ తెరవాలన్నారు.

10, 11 తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్


ఇన్‌స్పైర్ లోగో ఆవిష్కరిస్తున్న అధికారులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం డీఈవో కార్యాలయంలో ఆయన ఇన్‌స్పైర్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా నుంచి ఎంపికైన 189 ప్రాజెక్టులను జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన కార్యక్రమాన్ని బద్వేలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని.. 189 ప్రాజెక్టులు ఇందులో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమానికి అబ్జర్వర్ ఢిల్లీ నుంచి వస్తున్నారని తెలిపారు. ఏ కారణాల చేత గైర్హాజరు కాకూడదని అన్నారు. మిగతా వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి సెల్‌నెం.9441035830కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీవో ప్రభాకర్‌రెడ్డి, ఏడీ దేవరాజ్, డి.రాజగోపాల్‌రెడ్డితో పాటు సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పబ్బాపురం వద్ద రైతుల ఆందోళన

సికెదిన్నె, ఫిబ్రవరి 7: మండలంలోని పబ్బాపురం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఇక్కడ 1989లో టీచర్స్ హౌసింగ్‌బోర్డు ఏర్పాటు చేసి 1460 ప్లాట్లు కేటాయించుకున్నారు. అయితే అప్పట్లో అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు వారి స్థలాలను సాగు చేసుకుంటున్నట్లు అనంతరం కాలక్రమేణా చెర్లోపల్లె లేఅవుట్ ఏర్పడడంతో వారి ప్లాట్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఉపాధ్యాయులు వారి ప్లాట్లను అభివృద్ధి చేసుకునేందుకు కొలతలు వేసుకుంటుండగా రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణ పడినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై సీకే దిన్నె సీఐ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి : జేసీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సంబేపల్లె, ఫిబ్రవరి 7: నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం దేవపట్ల గ్రామం వైఎస్ఆర్ నగర్ వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ వాహనం వద్దకు వెళ్లి పరిశీలించారు. సకాలంలో నిత్యావసర సరుకులు అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో వ్యత్యాసం లేకుండా లబ్ధిదారులకు అందించాల్సిన బియ్యం, చక్కెర, కందిబేడలు సక్రమంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృపావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


పవిత్ర మృతదేహం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లెలో బుధవారం అత్తింటి వేధింపులు భరించలేక పవిత్ర (25) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... చక్రాయపేట మండలానికి చెందిన పవిత్రను ఐదు సంవత్సరాల క్రితం రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లెకు చెందిన సురేశ్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా భర్తతో పాటు అత్తింటి వారు అదనపు కట్నం కోసం తరచూ గొడవలు పడేవారన్నారు. దీంతో మనస్థాపానికి గురైన పవిత్ర (25) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

జాతీయ స్థాయిలో రిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ


వైద్య విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైద్య కళాశాలలో గత వారం నిర్వహించిన జాతీయ సదస్సులో రిమ్స్ వైద్య విద్యార్థులు విజయం సాధించి తమ సత్తా చాటారు. అక్కడ నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన రిమ్స్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు పీజీ వైద్య విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో జరిగిన పబ్లిక్ హెల్త్, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడం జరిగింది. మొదటి స్థానాన్ని డాక్టర్ బ్లెస్సిన్ రాజా, ద్వితీయ స్థానాన్ని డాక్టర్ జ్యోతిష్, డాక్టర్ హరిత, డాక్టర్ కారుణ్య, డాక్టర్ రాహుల్ కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతి డాక్టర్ గోపిక్రిష్ణ, వైద్య, వైద్యేతర సిబ్బంది అభినందించారు.

నాన్‌స్టాప్ బస్సులకు భాకరాపేటలో స్టేజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 7 : కడప డిపో నుంచి తిరుపతికి వెళ్లే నాన్‌స్టాప్ సర్వీసు బస్సులకు భాకరాపేటలో ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం భాకరాపేటలో తిరుపతి నాన్‌స్టాప్ బస్సులకు టికెట్స్ ఇచ్చేందుకు వీలుగా కండక్టర్స్ అందుబాటులో ఉంటారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం : ప్రయాణీకుల అభిప్రాయాలు, సూచనలు సలహాలు, సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా ఈనెల 8వ తేదీ గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న కడప డిపో మేనేజర్ తెలిపారు. 9959225774 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

15నుంచి వినియోగంలోకి రైతు బజార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 7: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నూత నంగా నిర్మించిన రైతు బజార్ ఈనెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి రానుందని మార్కెట్ యార్డు ఛైర్మన్ చిన్నప్ప తెలియజేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు పండించిన రైతులు నేరుగా రైతు బజార్‌లో అమ్ముకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. రైతు బజార్‌లో తాగు నీరు, పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉంటుందన్నారు. వైస్ ఛైర్మన్ కె.సర్వోత్తమరెడ్డి, సెక్రటరీ రత్న రాజు, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎస్టేట్ ఆఫీసర్ రుచిత, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వల్లూరు, ఫిబ్రవరి 7: జరగబోయే ఎన్నికలు దృష్ట్యా మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు అమర్‌నాథ్ రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు బాగా ఉన్నాయా లేదా అనే అంశంపై పరిశీలించారు. వెలు తురు ఉందా, లేదా, క్యూలైను ఎలా పెట్టాలనే అంశం పై కిందిస్థాయి అధికారులతో చర్చించారు. వల్లూరుతో పాటు పలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కేంద్రాల్లో అరకొర సమస్యలుంటే వెంటనే పూర్తి చేయాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల అరెస్టు తగదు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారానికి ఫిబ్రవరి 8, 9 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన ఆందోళనకు అనుమతులు లేవని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి పోరాడుతున్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. అరెస్టు చేసిన విద్యుత్ ఉద్యోగులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 7: పట్టణంలోని 33/11 కేవీ కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అర్బన్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కింద 11 కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 7: వైవీయూ పీజీ కళాశాల, అనుబంధ కళాశాలల్లో గురువారం నుంచి పీజీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టరు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8, 12, 14, 16, 19, 21 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి

కడప (క్రైం), ఫిబ్రవరి 7: అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని తాలుకా సీఐ రాజా సూచించారు. తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే బెల్టు దుకాణాలు నిర్వహించినా కూడా సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా కొత్త వ్యక్తులు మీ ప్రాంతాల్లో తిరుగుతున్నా అనుమానితులుగా ఉన్న నేరుగా తనకే సమాచారం ఇవ్వాలన్నారు.

చంద్రన్న పాలనలో అభివృద్ధికి అందలం

● వైసీపీ పాలనలో సంక్షేమానికి సమాధి ● పుత్తా సమక్షంలో 200 కుటుంబాలు టీడీపీలో చేరిక



నేలటూరు, పొట్టిపాటి నేతలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో గత టీడీపీ పాలనలో చంద్ర బాబు సీఎంగా అభివృద్ధికి అందలం వేశారని... ప్రస్తుత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలకు పూర్తిగా సమాధి కట్టారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజక వర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నా రు. చెన్నూరులో బుధవారం సాయంత్రం జరిగిన బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో కొత్తరోడ్డు, రామాలయంవీధి, భవానీనగర్, స్టేట్ బ్యాంకు వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి వైసీపీ అరాచకా లను వివరించడంతో పాటు టీడీపీని గెలిపించి సూపర్‌సిక్స్ పథకాలు అందుకోవాలని తెలిపారు.

చంద్రబాబు పాలనలో చంద్రన్న బీమా, అన్న క్యాంటీన్లు, పండుగ కానుకలు, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తే నేడు వైసీపీ పాలకులు వాటిని పూర్తిగా సమాధి చేశారన్నారు. కేవలం ఇసుక మట్టి, తెల్లరాయిలను ఎర్రచందనాన్ని దోపిడీ చేసి అమ్ము కుంటూ కోట్లు కూడబెట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నరు. కనీసం పేదలు పెళ్లి చేసుకుంటే పెళ్లికానుకలు ఇచ్చేందుకు కూడా రకరకాల నిబంధనలు పెట్టి సక్రమంగా అందకుండా చేశారన్నారు, చిన్న మధ్యతరగి కుటుంబాలు ఇళ్లు కట్టుకోవాలంటే సిమెంటు, ఇసుక కంకర, ఇనుము ధరలు విపరీతంగా పెంచారని, ఈపాలనలో ఇళ్లు కట్టుకోవాలన్నా భయ పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాటి ప్రభుత్వాన్ని ప్రజలే ఏం చేయాలో నిర్ణయించు కోవాలన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

నేలటూరు, పొట్టిపాటి గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు నేలటూరు వెంకటరమణారెడ్డి, నేలటూరు సుబ్బారెడ్డి, పొట్టిపాటి హనుమాన్‌రెడ్డి, పొట్టిపాటి జగదీశ్వర్‌రెడ్డి, రా.గోపాల్‌రెడ్డి, కరుణకుమార్‌రెడ్డి పవన్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పుత్తా పార్టీ కండువా వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోవు ఎన్నికల్లో తామంతా పుత్తా నరసింహారెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పుత్తా సాయినరసింహారెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీనేత ఆకుల ప్రసాద్‌బాబు, శివారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్ హుసేన్, కొండాల చెన్నయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతగాని దద్దమ్మ సీఎం జగన్

టీడీపీ, జనసేన నాయకులు



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందిస్తున్న మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 7: పరిపాలన చేతగాని దద్దమ్మ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జనసేన కడప నియోజకవర్గం ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ అన్నారు. 15వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డియాదవ్, నాయకులు ఈశ్వరయ్య ఆధ్వ ర్యంలో స్థానికులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. జగన్ రెడ్డి ఇంటికి పోయేందుకు తట్టా బుట్టా సర్దుకుని సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై టీడీపీ ఎలా పోరాడుతుందో అందరికీ తెలుసునన్నారు. సీఎం జగన్ ఒక్క అవకాశం పేరుతో అందరినీ మోసం చేశారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని తెలిపారు. టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో...: కడప నగరం 11వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన కడప జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే ఆ పథకాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో...: కడప నగరం 37వ డివిజన్ ఇన్‌చార్జ్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ టీడీపీ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఇర్ఫాన్, ఇమ్రాన్, నిజాముద్దీన్, నిసార్, హర్షద్ పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ క్యాన్లు వితరణ

వేంపల్లె, ఫిబ్రవరి 7: పట్టణంలోని తల్లిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పది కూలింగ్ వాటర్ క్యాన్లు వితరణగా అందించారు. బుధవారం చింతలమడుగుపల్లె వాసి పగడిపల్లె అస్సానయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మకు వాటర్‌క్యాన్లను అందజేశారు. తన కుమారుడు ఇదే పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించడంతో పాఠశాలకు వాటర్ క్యాన్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజల అభివృద్ధి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ప్రపంచమంతా మన దేశం వైపు చూసేలా దేశంలో అభివృద్ధి జరుగుతోందని కమలాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కమలాపురం మండల కన్వీనరు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో కమలాపురం నగర పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారు ప్రధానమంత్రి నరేంద్రమోడీతో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలన్నదే బీజేపీ లక్ష్యమని, రాష్ట్రంలో ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

జగతికే... జనని లూర్ధుమాత



దైవ సందేశం చేస్తున్న ఫాదర్లు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 7: యావత్ ప్రపంచంలోని ప్రజలందరికీ తల్లిలాగా అక్కున చేర్చుకుని వారి సాధకబాధలను తీరుస్తున్న లూర్థుమాత ఈ జగతికే జనని అని ఊటుకూరు విచారణ గురువు ఫాదర్ కాసు జోజిరెడ్డి కొనియాడారు. మరియాపురం లూర్థుమాత తిరుణాల మహోత్సవాలను పురష్కరించుకుని ఆరవ రోజైన బుధవారం స్థానిక మరియాపురం లూర్థుమాత చర్చిలో యర్రగుంట్ల విచారణ గురువు ఫాదర్ ఇట్టా మోసెస్ దివ్యబలి పూజను సమర్పించగా.. జోజిరెడ్డి లూర్థుమాత సందేశం గావించారు. ఈనెల 11న లూర్థుమాత మహోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారని.. మరియ తల్లిని స్తుతించనున్నట్లు వెల్లడించారు. పూజ ప్రారంభంలో మరియదళ సభ్యులు ప్రత్యేకంగా లూర్థుమాత తేరును అలంకరించి మరియాపురం పురవీధుల గుండా జపాలను జపిస్తూ ప్రదర్శించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ బిరుసురాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, మరియాపురం గ్రామ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పక్కా ఇళ్లనిర్మాణ పనులు వేగవంతం చేయాలి



కనుపర్తి వద్ద ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

చెన్నూరు, ఫిబ్రవరి 7: పక్కా ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ బాలగంగన్న అన్నారు. బుధవారం మండలంలోని కనుపర్తి లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఇంటి నిర్మాణాలు చేయించే కాంట్రాక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. అవసరమైతే మరింతమంది కూలీలను పెంచుకుని ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. పనుల్లో నాణ్యత మాత్రం తగ్గకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఎంపీటీసీ రఘురామిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవరుచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ సలీంబాషా, శాస్త్రవేత్త ప్రశాంతి

చెన్నూరు, ఫిబ్రవరి 7: ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజసేవ అలవరుచుకోవాలని కడప కోటిరెడ్డి కళాశాల ప్రిన్సిపల్ వి.సలీంబాషా అన్నారు. ఎన్ఎస్ఎస్ ఏడు రోజుల క్యాంపులో భాగంగా ఆఖరి రోజైన బుధవారం మండలంలోని రామనపల్లెలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. అనంతరం కడప కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రశాంతి, ప్రోగ్రాం కోఆర్డినేటరు విజయలక్ష్మిదేవి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన ధర్నా

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 7: ఆర్టీపీపీలో వేతనాలు ఒకటో తేదీనే ఇవ్వాలన్న డిమాండ్‌తో ఉద్యోగులు చేస్తున్న ధర్నా మూడో రోజుకు చేరుకుంది. బుధవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు మెయిన్‌గేటు వద్ద నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు జగదీష్, రమణయ్య, సుబ్బిరెడ్డి, రమణ, రామక్రిష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవుని కడప శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కడప (కల్చరల్), ఫిబ్రవరి 7: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 19వ తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు దేవుని కడప ఆలయ ఏఈవో నటేశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్ పేరం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం, సాయంత్రం వాహనసేవలు జరుగుతాయన్నారు. 10వ తేదీ ఉదయం 10-30 తిరుచ్చివాహనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామి దర్శనమిస్తారన్నారు. 11వ తేదీ ఉదయం సూర్యప్రభవాహనం, రాత్రి పెద్దశేషవాహనం, 12వ తేదీ ఉదయం చిన్నశేషవాహనం, అదేరోజు రాత్రి సింహవాహనం, 13వ తేదీ ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి హనుమంతవాహనం, 14వ తేదీ ముత్యపు పందిరి వాహనం, రాత్రి గరుడ వాహనంపై స్వామి ఊరేగుతారన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 16వ తేదీ ఉదయం 6-30 గంటలకు రథారోహణం మధ్యాహ్నం 2 గంటల నుంచి రథోత్సవం, 17వ తేదీ సర్వభూపాల వాహనం రాత్రి అశ్వవాహనం, 18వ తేదీ వసంతోత్సవం, చక్రస్నానం రాత్రి హంసవాహనం, ధ్వజావరోహణం చివరగా 19వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 7: రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా వుంటూ సిగ్నల్స్‌కు అనుగుణంగా ముందుకు సాగాలని ఆర్టీసీ కడప జోన్-4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక నాగార్జున స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించగలిగితే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ప్రతి వాహనం రోడ్డుకు ఎడమవైపునే ముందుకు సాగాలని, కొన్ని చోట్ల రోడ్డు అవతలివైపునకు వెళ్లే సమయంలో అటువైపు నుంచి వాహనాలు వస్తున్నాయా.. లేదా అనే విషయాన్ని గమనించి తదుపరి సిగ్నల్స్‌కు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి, కడప డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు, సీఐ కన్యాకుమారి పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



పెరటికోళ్ల పెంపకాన్ని చూపుతున్న రైతులు

సికెదిన్నె, ఫిబ్రవరి 7: పెరటికోళ్ల పెంపకం ఎంతో లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటికోళ్ల పెంపకం వలన రైతులకు ఆర్థికంగా అదనపు ఆదాయం చేకూరుతుందని.. ఆరోగ్యకరమైన మాంసం, గుడ్లు పొందవచ్చన్నారు. దీని ద్వారా శరీరానికి అవసరమైన మాంసకృత్తులు బాగా అంది ఆరోగ్యకరంగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెరిటికోళ్ల యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో వల్లూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి, ఖాజీపేటకు చెందిన 45 మంది రైతులు పాల్గొన్నారు. వారికి షెడ్యూలు కులాల ఉప ప్రణాళిక కింద 450 కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నిజాయితీ అలవరచుకోవాలి



విజేతలైన విద్యార్థులతో కెనరాబ్యాంకు, పాఠశాల సిబ్బంది

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 7: ప్రతి విద్యార్థి నిజాయితీ, క్రమశిక్షణలను విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలని కెనరాబ్యాంకు సీనియర్ మేనేజరు సంపత్ కుమార్ పేర్కొన్నారు. మరియాపురంలోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు స్వచ్ఛ భారత్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మరియాపురం శాఖ మేనేజరు రతన్‌పాల్ విద్యార్థులకు స్వచ్ఛ భారత్ గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్, హెచ్ఎం సిస్టర్ లీనారోజ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో మధుసూదన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో చేపట్టిన జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆర్డీవో పరిశీలించారు. స్వయంగా తానే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమలాపురంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ బాగా కొనసాగుతోందన్నారు. మండలంలో 783 లబ్ధిదారులు ఉన్నారని, ప్రస్తుతం 267 రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దారు అహల్య, ఆర్ఐ అర్జున్, వీఆర్వోలు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలి



రాజులకాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న

చెన్నూరు, ఫిబ్రవరి 7: డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎంసీ వీరన్న అన్నారు. బుధవారం చెన్నూరు రాజుల కాలనీ నుంచి బెస్తకాలనీ వరకు రూ.45 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు వర్షాకాలం, పంటల కాలంలో పై నీరంతా ఇళ్లవద్దకు వచ్చి ఇబ్బందులు పడేవారన్నారు. డ్రైనేజీ నిర్మాణ పూర్తయితే సమస్య తొలిగిపోతుందన్నారు. కార్యక్రమంలో డీఈ మురళిక్రిష్ణ, ఏఈ వినోద్‌కుమార్‌రెడి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మాటలగారడీ బడ్జెట్ : సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ రెండు లక్షలా 86కోట్ల పైచిలుకు ప్రవేశపెట్టింది. అయితే బడ్జెట్ ప్రసంగం కంటే వైసీపీ ప్రసంగంలా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శిం చారు. సుపరిపాలన ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మహిళా మహారాణి ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమ ఆంధ్ర, సంపన్న ఆంధ్ర , భూబద్ర ఆంధ్ర అంటూ తప్పుడు సమాచారాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారన్నారు.

రాష్ట్రంలో పాలనే అస్తవ్యస్తంగా ఉందని.. రాజధాని లేకుండా మూడు రాజ ధానుల పేరుతో ఐదేళ్లకాలం గడిపారన్నారు. జిల్లాలో నీటిపారుదల ప్రాజక్టులకు అధిక నిధులు కేటాయించకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయన్నారు. కడప జిల్లా పూర్తిగా కరువుతో అల్లాడుతుంటే కరువు లేదని అధికారులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మండల అభివృద్ధికి ఏమి చేశారు..?

టీడీపీ మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 : మండల అభివృద్ధికి మండల పరిషత్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్ ఏమి చేశారో చెప్పాలని టీడీపీ మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక వసంతపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయానికి ప్రారంభానికి వచ్చిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, తనపై ఎంపీపీ శేఖర్ యాదవ్ విమర్శలు చేయడం తగదన్నారు. పంచాయతీ నిధుల కోసం సర్పంచ్‌లు ప్రభుత్వంతో పోరాడుతుంటే, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్నికోరకపోవడం దారుణమన్నారు. మార్కెట్‌ను పునర్నిర్మించి ఓట్లు అడుగుతానన్న ఎమ్మెల్యే ఇంత వరకు మార్కెట్ నిర్మాణం పూర్తి చేయలేకపోయారన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్కెట్ వలన విద్యార్థులు, మార్కెట్ వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టీడీపీ కార్యాలయం ప్రారంభానికి ఎంపీపీ నివాసం ఉన్న సోములవారిపల్లె పంచాయతీ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారని, ఎంపీపీ తమపై విమర్శలు మాని మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు, పాలఫ్యాక్టరీని తెరిపించడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఖాజా, ఈశ్వర్‌రెడ్డి, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధం

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 : మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం పూర్తి చేయలేక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అసమర్థుడుగా మిగిలిపోయారని, ప్రత్యేక హోదా తెస్తానని చేతులెత్తేశారని విమర్శించారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగుల ఆశలను వమ్ము చేశారని, అమ్మ ఒడికి రూ.2వేలు కోత వేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో సుబ్బరాజు, గోమేధికం సుదర్శన్ పాల్గొన్నారు.

ఈకేవైసీ వందశాతం పూర్తి చేయాలి

ముద్దనూరు ఫిబ్రవరి7:ఈకేవైసీ త్వరితగతిన వందశాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు ఆర్బీకే సిబ్బందికి సూచించారు.స్థానిక వ్యవసాయ క్షేత్రంలో బుధవారం క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు పథకాలు అందేలా చూడాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సలహాలు,సూచనలు ఇవ్వాలన్నారు. ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవో వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా ఈకేవైసీ పూర్తి చేయాలి

మైలవరం, ఫిబ్రవరి 7: రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ పూర్తి చేసుకున్న పంటలకు ప్రతి రైతు ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ కార్యాలయ ఏడీఏ మాధవి, ప్రొద్దుటూరు ఏడీఏ సురేష్, ఏవో విజయారావు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన

కొండాపురం,ఫిబ్రవరి 7 :పట్టణంలోని తాతయ్య గుట్ట కాలనీ వాసులు నీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు.నెలరోజులుగా తమకు నీరు రాకున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే గండికోట జలాశయం ఉన్నా తమకు నీటి వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వారు మండిపడ్డారు.ఈ విషయమై ఎంపీడీవో కృష్ణప్రసాద్ ను వివరణ కోరగా తక్షణమే నీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.శాశ్వత పరిష్కారనికి ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యకు వెంటనే పరిష్కారం చూపండి

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 7 : మైదుకూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య ముంచుకొస్తోంది వెంటనే పరిష్కార చర్యలు చేపట్టండి అని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు బుధవారం వినతి పత్రం అందించిన రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ అందచేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి ఎర్రచెరువుకు నీటిని వదలడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని తద్వారా బోర్లలో నీరు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. వెంటనే చర్యలు చేపట్టపోతే ఈ నెల 12వ తేదీన మున్సిపాలిటీ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

జీవితాశయంతో కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నతస్థానంలో నిలువాలని పలువురు వక్తలు సూచించారు. జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం సభ నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో జమ్మలమడుగు బార్ అసోసియేషన్ న్యాయవాది, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివినవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భూతమాపురం సుబ్బారావు, ప్రిన్సిపాళ్లు నాగభూషణ్‌రెడ్డి, త్రివిక్రమ్‌రెడ్డి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కళాశాలలో నలుగురు టాపర్స్‌ను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.500 నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, కళాశాల నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటమి తప్పదు







ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలులో ప్రచారం చేస్తున్న వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి, బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 7 : వైసీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటమి తప్పదని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీ రాజరాజేశ్వరీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు సూర్యనారాయణరెడ్డి, పేట రమణ, వార్డు మెంబరు ఇస్మాయిల్,ఖదీర్,శేఖర్‌రెడ్డి, చెల్లుబోయిన రామకృష్ణ, చింతల సాయి మనోజ్‌కుమార్,చింతనారాయణరావు, వద్ది బాలుడు, లక్ష్మీపేట గురివిరెడ్డి, చీమల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 13, 19 వార్డుల్లో ఆయన పర్యటించారు. ఆయన ప్రతి దుకాణం వద్దకు, ఇంటికి వెళ్లి టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున, దేవగుడి యూత్ ముద్రా బాలపుల్లారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి గైబూవలి, బూత్ ఇన్‌ఛార్జి శంకర్ రెడ్డి, షేక్ ఖాదర్, ఎ.మస్తాన్‌వలి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, కె.నాగరాజుయాదవ్, రసూల్ నాయక్, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు..: రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ విజయ భావుటా ఎగురవేస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లె పంచాయతీలో బూత్ నెం.23 పాత రామాపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మాజీ మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ రంతుల్లా, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భద్రయ్య, పెద్దిరెడ్డి రామక్రిష్టారెడ్డి, బారెడ్డి నారాయణరెడ్డి, రామాంజనేయరెడ్డి, అక్కిశెట్టి నాగేంద్ర, కత్తి తిమోతి, బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, సత్యనారాయణ, బాలసిద్దారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఖాసిం, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. బుధవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు, మునీర్‌కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్వకూరి రమణ, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, టీడీపీ కార్యదర్శి తిరుమలశెట్టి సుబ్బారావు, ఎస్సీ సెల్ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీతోనే ప్రొద్దుటూరు అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. బుధవారం 41 వవార్డు హనుమాన్‌నగర్ ఏరియాలోబాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో 41 వార్డు ఇన్‌చార్జ్ శూలం శివప్రసాద్, 38 పల్లాలక్ష్మీదేవి, 37 పొట్టిపాటి గంగాధర్, మాజీ కౌన్సిల్లర్ భాగ్యమ్మ, ఆవుల దస్తగిరి, తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి దేవగుడి సరస్వతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బోగాలకట్ట, బొగ్గులదాసరిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, దీప్తి, లక్ష్మీ, సుబ్బలక్షుమ్మ, కులాయమ్మ, దస్తగిరమ్మ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతలచెరువు, బయనపల్లె తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, గాజులపల్లె చంద్రశేఖర్రెడ్డి, బిజివేముల రమణారెడ్డి, మల్లయ్యతదితరులు పాల్గొన్నారు.







ప్రొద్దుటూరు 41 వవార్డు ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి, మైలవరంలో టీడీపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి దేవగుడి సరస్వతి, చింతలచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి తదితరులు

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



మాట్లాడుతున్న ఏవో శివరామక్రిష్టారెడ్డి, సివిల్ సప్లై అధికారులు

రాజుపాలెం, ఫిబ్రవరి 7 : జొన్నల కొనుగోలు కేంద్రం సోమవారం నుంచి మండల పరిధిలోని టంగుటూరు ఆర్బీకేలో ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి శివరామక్రిష్ణరెడ్డి, ఏపీ సివిల్ సప్లై అధికారులు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఎక్కడ అనే శీర్షిక బుధవారం ప్రచురణ కావడంతో అధికారులు స్పందించారు. గురువారం నుంచి ఆర్బీకేల వద్ద రైతులు తాము పండించిన జొన్నలను శాంపిల్స్ తీసుకురావడంతో వాటిని పరిశీలించి టోకెన్ అందిస్తామని తెలిపారు. టోకన్లు అందుకునే రైతులు తమ పంట పొలాలను జొన్న ఈక్రాప్ చేసి ఉండాలని తెలిపారు. క్వింటాకు రూ.3180 ధర చెల్లించడంతో పాటు ఒక ఎకరాకు 18 క్వింటాళ్ల కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక రైతుకు 15 ఎకరాలకు పంట కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు తన జొన్నలను జల్లెడ వేసి ఆర్బీకేలకు తీసుకురావాల్సిందిగా వారు తెలిపారు.

సివిల్ సప్లై నియమ నిబంధనలు..: జొన్నల నాణ్యత ప్రమాణాలు గరిష్ట పరిమిత శాతం విదేశీ పదార్థాలు 1.0, ఇతర పదార్థాలు 3.0, దెబ్బతిన్న గింజలు 1.5, కొద్దిగా దెబ్బతిన్న రంగు మారిన గింజలు 1.0, చిరిగిన (పగిలిన) అపరిపక్వ ధాన్యాలు 4.0, వీవిల్డ్ ధాన్యాలు 1.0, తేమ శాతం 14శాతం ఇవి నిబంధనలని వారు తెలిపారు. రైతులకు కొనుగోలు జరిగిన వెంటనే 21 రోజుల్లో తమ అకౌంట్లలో డబ్బులు పడే విధంగా చేస్తామని తెలిపారు.


ఉక్కు పరిశ్రమపై మాట్లాడాలి

బద్వేలు, ఫిబ్రవరి 7 : పార్లమెంటు సమావేశంలో ప్రత్యేక హోదా, ఉక్కు పరిశ్రమపై మాట్లాడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ ప్రభుత్వంపై హామీలను రాష్ట్రానికి ప్రత్యేక హోదా, జిల్లాలో ఉక్కు పరిశ్రమపై ఏపీ ఎంపీలు బీజేపీని నిలదీయాలన్నారు. బుధవారం బద్వేలు సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో ఈ అంశాలపై చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం, ఫిబ్రవరి 7 : మండల పరిధిలో నేడు 9గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారి చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసపురం సబ్ స్టేషన్, పీపీ కుంట సబ్‌స్టేషన్ పరిధిలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించాల్సి ఉందన్నారు. ప్రజలు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ జుబేదా

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 7 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాబోయే రోజుల్లో చేపట్టబోయే పనులపై శిక్షణ తరగతులు బుధవారం చేపట్టారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా ఉపాధి హామీ ఏపీడీ జుబేదా హాజరయ్యారు. ఈ శిక్షణ తరగ తులు ఏపీవో హరిక్రిష్ణ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం ఈ శిక్షణ తరగతుల్లో రేకలకుంట్ల పంచాయతీలో ప్రభల్ ప్రాజెక్టు ద్వారా క్షీణించిన కొండలను తిరిగి అభివృద్ధి చేసే కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సీఎస్ఏ సంస్థ రాష్ట సమన్వయ కర్త ఆదినారాయణ, క్లస్టర్ కోఆర్డినేటరు మహేష్, ఎన్ఆర్ఈజీఎస్, ఫీల్డ్ అసిస్టెంట్లు,కిసాన్ మిత్ర జయన్న,ఏపీవో హరిక్రిష్ణ, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఉపాధి పనులు చూపించాలి..: బ్రహ్మంగారిమఠం మండలంలోని అర్హులైనవారికి పనులను చూపించాలని ఏపీడీ జుబే దా శిక్షణ తరగతుల్లో సిబ్బందికి తెలిపారు. అనంతరం ఇటీవల వర్షం నీరు ఇంకిపోవడానికి నీటి గుంటలను ఏర్పాటు చేశారు. ఆమె సిబ్బందితో వెళ్లి ఇంకుడు గుంతలను పరిశీలించారు.

రాయలసీమ అభివృద్ధికి ఉద్యమిద్దాం

బద్వేలు, ఫిబ్రవరి 7 : రాయలసీమ అభివృద్ధి కోసం ఉద్యమిద్దామని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం రాష్ట్ర కన్వీనర్ కారు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బద్వేలులో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఏపీకి బలవంతంగా విభజించి నేటికి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మొండి చేయి చూపిందన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అభివృద్ధి శూన్యమని, నియోజకవర్గానికి నిధులు రాబట్టడంలో అధికార పక్షం వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రామరాజు, సుబ్రహ్మణ్యం, బాబు, చంద్రపాల్ పాల్గొన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జడ్జీలు బాబా ఫక్రుద్దీన్, ఎస్.భార్గవి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7: జైళ్లలో ఉన్న బాల నేరస్థులను గుర్తించడం న్యాయ సహాయం అందించడం కోసం పాన్ ఇండియా ప్రచారమని జిల్లా లీగల్ న్యాయసేవా అథార్టీ సెక్రటరీ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగులో సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం సబ్‌జైలు రికార్డులు పరిశీలించారు. అక్కడి నుంచి జమ్మలమడుగు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, కమలాపురం, ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ జైళ్ల సూపరింటెండెంట్లు హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఖాజీపేట, ఫిబ్రవరి 7: కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. బుధవారం ముఖ్య అతిథిగా ఎంఈవో సత్యనారాయణ హాజరయ్యారు. 33 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. క్రమశిక్షణతో చదువుకుని పదో తరగతి పాస్ కావాలని అన్నారు. సేవా సంస్థ బృందం కొండారెడ్డి, ఉపేంద్ర, చెన్నకేశవరెడ్డి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన ధర్నా

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 7: ఆర్టీపీపీలో వేతనాలు ఒకటో తేదీనే ఇవ్వాలన్న డిమాండ్‌తో ఉద్యోగులు చేస్తున్న ధర్నా మూడో రోజుకు చేరుకుంది. బుధవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు మెయిన్‌గేటు వద్ద నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు జగదీష్, రమణయ్య, సుబ్బిరెడ్డి, రమణ, రామక్రిష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన స్థలాలు పేదలకు ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 : మండలంలో ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి పేదలకు కేటాయించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఆస్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవితేజ, ప్రతాప్, చిట్టిబాబు, కుమార్ పాల్గొన్నారు.

రెండు మోటారు బైకులు ఢీ : ముగ్గురికి గాయాలు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 7: మండలంలోని మార్కాపురం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. కలసపాడు మండలం జాతివర్తిపల్లె గ్రామానికి చెందిన శివ, సాయి అనే వారు పోరుమామిళ్లకు వస్తుండగా శంకవరానికి చెందిన రామయ్య అనే వ్యక్తి పోరుమామిళ్ల నుంచి శంకవరం వెళుతుండగా మార్కాపురం వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.



నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



సమీక్షిస్తున్న కమిషనర్ మల్లికార్జున

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 7 : ఈ నెల 9న నిర్వహించబోయే నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్ కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె, సురేంద్రనగర్, కోటవీధి, గాంధినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉపాధ్యాయులు, అంగన్వాడీ , ఆశ, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు జూనియర్ కళాశాలల్లో 0- 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరు చంద్రమౌళి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఫిబ్రవరి 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని కమిషనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాయలంలో మెడికల్ ఐసీడీఎస్, విద్యా శాఖ అధికారులతో కమిషనర్ మల్లికార్జున సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థికి నులిపురుగుల మందును అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ శివప్రసాద్, ఎంఈవో శోభారాణి,ఐసీడీఎస్, సీడీపీవోలు హైమావతి, అరుణ మెడికల్ ఆఫీసర్లు హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఫిబ్రవరి 9న నిర్వహించనున్న సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, వైద్యశాఖ అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీడీవో మల్లేశ్వరప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫిబ్రవరి 9న అంగన్వాడీ సెంటర్లలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందివ్వాలని సిబ్బందికి తెలిపారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: జాతీయ నులిపురుగుల నియంత్రణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి ముబిన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌డీడీ డీవార్మింగ్‌డే నిర్వహించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగులను నియంత్రించాలంటే ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని వారు తెలిపారు. అలాగే మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం ఉంటుందని, ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నాగభూషణం, ఈవోఆర్‌డీ, ఎంఈవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.